క్లుప్తంగా

నేడు భర్నికం సచివాలయం ప్రారంభం

పరవాడ: భర్నికం గ్రామంలో ప్రభుత్వం రూ.25 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ బుధవారం ఉదయం 9.30 గంటలకు ప్రారంభిస్తారని వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలోఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మి , జెడ్పీటీసీ పైల సన్యాసిరాజు పాల్గొంటారని చెప్పారు. మండలంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలే, ముఖ్య నాయకులు హాజరై విజయవంతం చేయాలని కోనరామారావు కోరారు.

పోషకాహారంతో ఆరోగ్యం


బాలింతలకు బహుమతి అందజేస్తున్న వైస్ ఎంపీపీ అప్పలరాజు

పరవాడ: వాడచీపురుపల్లి శివారు పందివాని పాలెం అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం పోషకాహార వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న వైస్ ఎంపీపీ బి.అప్పలరాజు మాట్లాడుతూ బాలింతలు, గర్భిణులకు పోషకాహార విలువల గురించి వివరించారు. వెల్‌బేబీ షోలో వయస్సుకు తగ్గ బరువు ఉన్న వారిని ఎంపిక చేసి బహుమతులు అందజేశారు. కూరగాయలు, ఆకు కూరలు, చిరుధాన్యాలు, తక్కువ ఖర్చుతో అధిక పోషకాలు కలిగిన ఆహార పదార్థాలను తీసుకోవాలని వైస్ ఎంపీపీ అప్పలరాజు సూచించారు. కార్యక్రమంలో సబ్బవరం సీడీపీవో లలిత్‌కుమారి, సూపర్‌వైజర్ ఉమా, లంకెలపాలెం పీఏసీఎస్ చైర్మన్ బురద రాజు, ఉప సర్పంచ్ కె.శ్రీను, అంగన్‌వాడీ కార్యకర్తలు కె.కనకలక్ష్మి, ఎం.అమ్మాజీ, పి.ప్రభావతి, ఆర్.వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు కింద పడి వృద్ధురాలి మృతి

అల్లిపురం : ఆర్టీసీ బస్సు కింద పడి గుర్తు తెలియని వృద్ధురాలు ఆదివారం సాయంత్రం మృతి చెందింది. ద్వారకాబస్ స్టేషన్ వద్ద భిక్షాటన చేసుకునే ఆమె ప్రమాదవశాత్తు 38 హెచ్ బస్ కింద పడటంతో అక్కడికక్కడే మృతి చెందింది. విషయం తెలుసుకున్న టూటౌన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. సుమారు 5 అడుగుల ఎత్తు కలిగిన ఆమెను గుర్తించిన వారు టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని సీఐ బి.తిరుమలరావు కోరారు. ఆచూకీ తెలిసిన వారు 9440904716, 9908001600 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

మృతదేహం గుర్తింపు

అక్కిరెడ్డిపాలెం: ఆటోనగర్ కెనరాబ్యాంక్ వెనుక చట్టివానిపాలెంలోని ఓ ఇంటి వరండాలో మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. గాజువాక ఎస్ఐ కొల్లి సతీష్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. చట్టివానిపాలెంలో చెల్లిబోయిన అప్పలనర్సమ్మ ఇంట్లో చంటి అనే క్రేన్ ఆపరేటర్ రెండు నెలలుగా అద్దెకు ఉంటున్నాడు. అతని భార్య చిన్నమ్మలు వారం రోజులుగా ఊళ్లో లేదు. రెండు రోజులుగా అతడు వరండాలో పడుకుని లేవకపోవడం, దుర్గంధం రావడంతో మృతి చెందినట్లు గుర్తించిన స్థానికులు సోమవారం రాత్రి గాజువాక పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న ఎస్ఐ సతీష్ వివరాలు సేకరించారు. మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు.

అనాథ మృతదేహానికి 'రెడ్ క్రాస్' అంత్యక్రియలు

ఎంవీపీకాలనీ: కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి మృతదేహానికి రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులు మంగళవారం అంత్యక్రియలు నిర్వహించారు. వివరిలివి.. ఆగస్టు 30వ తేదీన నిస్సహాయ స్థితిలో ఉన్న ఓ వ్యక్తిని సొసైటీ ప్రతినిధులు చికిత్స నిమిత్తం కేజీహెచ్‌లో జాయిన్ చేశారు. అప్పటి నుంచి ఆస్పత్రిలో చికిత్స పొందిన ఆ వ్యక్తి ఆరోగ్యం క్షీణించడంతో ఈ నెల 4వ తేదీన మరణించారు. కేజీహెచ్ సీఎస్ఆర్ఎం అందించిన సమాచారంతో రెడ్‌క్రాస్ ప్రతినిధులుపంచనామా పూర్తి చేయించారు. అనంతరం జ్ఞానాపురంలోని శ్మశానవాటికకు తరలించి అంత్యక్రియలు నిర్వహించారు.

క్యాన్సర్‌పై అవగాహన అవసరం

పద్మనాభం: మహిళల్లో 40 ఏళ్ల దాటిన వారికి క్యాన్సర్ రావచ్చని బ్రింద ఆస్పత్రి అంకాల జిస్టు వంశీధర్ అన్నారు. కృష్ణాపురం లోగ్రామీణ వైద్యులకు క్యాన్సర్‌పై నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. ఎనిమిది నుంచి 14 ఏళ్ల వయస్సు మధ్యలో క్యాన్సర్ రాకుండా వ్యాక్సిన్ ఉందన్నారు. మండల గ్రామీణ వైద్యుల సంఘం అధ్యక్షుడు ఆర్. అప్పారావు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సీతాలక్ష్మి


ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో..



సర్వేపల్లి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

ఉపాధ్యాయుల సేవలు వెలకట్టలేనవి

ఎంపీపీ బోకం సూర్యకుమారి

సబ్బవరం: సమాజంలో అన్ని వృత్తుల కంటే ఉపాధ్యాయుడు అందించే సేవలకు లభించే గౌరవం వెల కట్టలేనిదని ఎంపీపీ బోకం సూర్యకుమారి అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో భారత మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని మంగళవారం నిర్వహించిన గురుపూజోత్సవ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎంపీపీ సూర్యకుమారి మాట్లాడుతూ సాధారణ ఉపాధ్యాయుడిగా పనిచేసి భారత రాష్ట్రపతిగా ఎదిగిన మహోన్నత వ్యక్తి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ అని కొనియాడారు. ఈ సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేసిన 9 మందిని ఘనంగా సత్కరించారు. పురస్కారం అందుకున్న వారిలో పి. తమ్మారావు, సీహెచ్ సత్యశివ కుమార్,ఈ. స్వర్ణకుమారి, ఈ. పార్వతి, పినాకి పాణి, సత్తిబాబు, జయలక్ష్మి,షేక్ కరీముల్లా, ఎం. రమణమ్మ ఉన్నారు.

కార్యక్రమంలో ఎంపీపీ రమేష్ నాయుడు, వైస్ ఎంపీపీ శరగడం ఝాన్సీ లక్ష్మీరాణి, సబ్బవరం సర్పంచ్ దెడ్డం ప్రసాదరావు, ఎంఈవోలు లక్ష్మణరావు,సూర్యనారాయణ,నాయకులు బోను గంగునాయుడు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు హేమంత్ సుదేవ్, ఆర్. ప్రసాదరావు, వి. భాస్కర రావు, ఎస్. అప్పలనాయుడు, కేవీ రమణ, పి. నాగ రాజు,ఎంఎస్‌వో కో ఆర్డినేటర్లు మహేష్,సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.


పురస్కారాలు అందుకున్న ఉత్తమ ఉపాధ్యాయులతో ఎంపీపీ బోకం సూర్యకుమారి తదితరులు

● సబ్బవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ సీతాలక్ష్మి తోటి అధ్యాపకులతో కలిసి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

● సబ్బవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెచ్ ఎం ఎస్. తిరుపతిరావు, ఇతర ఉపాధ్యాయులు సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి చేశారు.

గురువులకు సముచిత స్థానం

పరవాడ: గురువులకు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ వల్ల సముచిత స్థానం దక్కిందని వాడచీపురుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం పందిరి కనకేశ్వరరావు అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని పాఠశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సర్వేపల్లి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం హెచ్ఎం మాట్లాడుతూ విద్యార్థులు సన్మార్గంలో నడవాలని సూచించారు. విద్యార్థులు రాధా కృష్ణన్ వేషధారణలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విక్టోరియా ఫ్రాన్సిస్, రమేష్‌బాబు, అప్పలనాయుడు, అప్పలరాజు, శ్యామసుందర్, కూర్మారావు, సంజీవరావు, ఎస్. ఎస్.రెడ్డి, అన్నాజీరావు పాల్గొన్నారు.

సింహాచలం: ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను పెందుర్తి మండలంలోని విద్యాసంస్థల్లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు.

● పెందుర్తి లిటిల్ ఫ్లవర్స్ ఇంగ్లిష్ మీడియం ఉన్నత పాఠశాలలో డైరెక్టర్ కేవీఎస్ రాజు, ప్రిన్సిపాల్ ఎం .పద్మావతి సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఏడుగురు ఉపాధ్యాయులను సత్కరించారు. అలాగే దేశభక్తి, కుటుంబ వ్యవస్థ గొప్పతనాన్ని చాటిచెబుతూ ఉపాధ్యాయులు వేసిన నాటిక ఆకట్టుకుంది.


ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ చంద్రశేఖర్

● పెందుర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రాధాకృష్ణన్ చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. ఉపాధ్యాయులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. విద్యార్థులు చేసిన పలు సాంస్కృతి కార్యక్రమాలు అలరించాయి. సీనియర్ ఉపాధ్యాయులు పైడితల్లి, ఎస్.రాము, వరలక్ష్మిలను ప్రధానోపాధ్యాయురాలు చిన్నమ్మాయి, కార్యదర్శి కె.మురళీకృష్ణ ఘనంగా సత్కరించారు.

● సుజాతనగర్‌లోని రవీంద్రభారతి పాఠశాలలో రాధాకృష్ణన్ చిత్రపటానికి పాఠశాల చైర్మన్ ఎంఎస్ మణి, జోనల్ ఇన్‌చార్జి ఎస్.వెంకటేష్, ప్రిన్సిపాల్ స్వరూప చంద్రకళ నివాళులర్పించారు.


ఉపాధ్యాయురాలిని సత్కరిస్తున్న లిటిల్ ఫ్లవర్స్‌పాఠశాల ప్రిన్సిపాల్ పద్మావతి తదితరులు


పెందుర్తి ప్రభుత్వ హైస్కూల్‌లో రాధాకృష్ణన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు


వేడుకల్లో పాల్గొన్న రవీంద్రభారతి పాఠశాల ఉపాధ్యాయులు

సుబ్రహ్మణ్యస్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు


సుబ్రహ్మణ్యస్వామి

సింహాచలం: అడవివరం దరి విజినిగిరిపాలెంలోని ఉమాచంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో వేంజేసిన వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామికి మంగళవారం అభిషేకాలు, పూజలు భక్తి శ్రద్ధలతో నిర్వ హించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ ఈ పూజలను నిర్వహించారు.

కల్యాణం.. కమనీయం


కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం నిత్య కల్యాణం విశేషంగా జరిగింది. ఉదయం 9.30 గంటల నుంచి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణ ధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు. అర్చకుడు పెద్దరాజు తదితరులు కల్యాణం నిర్వహించారు.

భర్త నుంచి ప్రాణహాని ఉందని ఫిర్యాదు

జనసేనలో ఉండడంతో ఏమీ చేయలేరని బెదిరిస్తున్నాడని భార్య వెల్లడి

సింహాచలం: భర్త వేధింపులు తట్టుకోలేక పెందుర్తి పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించింది ఓ భార్య. జనసేన పార్టీలో ఉన్న తనను ఎవరూ ఏమీ చేయలేరని పదే పదే వేధించడంతో పాటు చంపేస్తానని బెదిరిస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొంది. భర్త వల్ల తనకు ప్రాణహాని ఉందని పోలీసులు, మీడియా ఎదుట తన ఆవేదనను వెల్లడించింది.

ఆమె మాటల్లోనే.... చింతగట్లకు చెందిన మునస త్రివేణి, మునస శివ ఏడేళ్ల కిందట ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరికి ఇద్దరు మగ పిల్లలు ఉన్నారు. శివ లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. వివాహం అయిన ఏడాది పాటు బాగానే ఉన్నారు. ఆ తర్వాత నుంచి త్రివేణిని వేధించడం మొదలుపెట్టాడు. అంతే కాకుండా వేరే మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకుని ఆమెతో కూడా త్రివేణిని బెదిరిస్తున్నాడు. నువ్వు కట్నం తీసుకురాలేదు.. ఎక్కడ చెప్పుకుంటావో చెప్పుకో అని, జనసేన పార్టీలో ఉన్న తన వెనుక అయిత సింహాచలం, దమ్ము రమేష్, చందక గోవింద్ తదితరులు ఉన్నారని బెదిరిస్తున్నాడని వాపోయింది. దీంతో కొన్ని రోజుల కిందట నుంచి ఇద్దరు పిల్లలతో కలిసి పుట్టింటిలోనే ఉంటోంది. కాగా శివ సోమవారం త్రివేణి పుట్టింటికి వెళ్లి ఆమె తల్లితో పాటు అన్నయ్యను కొట్టి బలవంతంగా ఆమెను తన ఇంటికి తీసుకొచ్చేశాడు. దీంతో తన భర్త శివ వల్ల భయంగా ఉందని మంగళవారం త్రివేణి బంధువులు, చింతగట్లలోని పలువురు నిర్వాసితులతో కలిసి పెందుర్తి పోలీస్‌స్టేషన్‌లో సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ అసిరి తాతను కలిసి ఫిర్యాదు చేసింది. కుటుంబ విషయం కావడంతో దిశ పోలీస్ స్టేషన్‌కి వెళ్లాలని పెందుర్తి పోలీసులు సూచించారు.



పెందుర్తి పోలీస్‌స్టేషన్ వద్ద చింతగట్ల గ్రామస్తులు, బంధువులతో త్రివేణి

డబుల్ ఎంట్రీ, వలస ఓటర్లకు నోటీసులు


సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మారెడ్డి

గాజువాక: గాజువాక నియోజకవర్గంలో ఓటు నమోదై ఉండి వలస వెళ్లిన ఓటర్లకు, డబుల్ ఎంట్రీలు కలిగిన ఓటర్లకు నోటీసులను జారీ చేశామని గాజువాక ఓటర్ల నమోదు అధికారి డి.లక్ష్మారెడ్డి తెలిపారు. అఖిలపక్ష రాజకీయ పార్టీల నాయకులతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇంటింటికీ వెళ్లి ఓటర్ల జాబితాలపై నిర్వహించిన సర్వే నూరుశాతం పూర్తయిందన్నారు. ఈ సర్వేలో గుర్తించిన చేర్పులు, మార్పులు, తొలగింపుల డేటా నమోదును ప్రారంభించామని తెలిపారు. సున్నా డోర్‌నంబర్ కలిగిన 54 ఓటర్ల చిరునామాలను మార్పు చేశామని చెప్పారు.

సమస్యలు పరిష్కరించకపోతే సమ్మె బాట

దాబాగార్డెన్స్ : సమస్యలు పరిష్కరిస్తామని చెప్పి గడువు ముగిసినప్పటికీ ఏ ఒక్క సమస్య పరిష్కరించకపోవడంతో ఈ నెల 15 నుంచి మున్సిపల్ కార్మికులు సమ్మె బాట పట్టనున్నారని జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు పి. వెంకట్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఉరికిటి రాజు, అధ్యక్షుడు నూకరాజు తెలిపారు. సిటు కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. జూన్ 16న కార్మిక డిమాండ్లపై జరిగిన ఒప్పందం సందర్భంగా తాత్కాలికంగా సమ్మె వాయిదా వేశామన్నారు. గత నెల 31లోగా మొత్తం 38 డిమాండ్లు పరిష్కరిస్తామని మున్సిపల్ అధికారులు హామీ ఇచ్చారని, అయినా ఏ ఒక్క డిమాండ్ పరిష్కరించలేదన్నారు. సమస్య లు వెంటనే పరిష్కరించకపోతే ఈ నెల 15 నుంచి మున్సిపల్ కార్మికులు సమ్మె బాట పట్టనున్నారని తెలిపారు. పారిశుధ్య విభాగంలో ఖాళీగా ఉన్న పోస్టులు వెంటనే భర్తీ చేయాలని, క్లాప్ డ్రైవర్లకు రూ.18,500 జీతం, ఆప్కాస్‌లో చేర్చడం, యూజీడీ, పబ్లిక్ హెల్త్ డ్రైవర్లు, వెటర్నరీ, మలేరియా కార్మికులకు హెల్త్ అలవెన్స్ చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎస్. రమణ, జె. నాయుడు పాల్గొన్నారు.

పారదర్శకంగా ప్రభుత్వ పథకాల అమలు

ట్రైనీ కలెక్టర్ స్మరణ్ రాజ్

సబ్బవరం: ప్రభుత్వ పథకాలతో పాటు సేవలను పారదర్శకంగా అందించాలని ట్రైనీ కలెక్టర్ స్మరణ్ రాజ్ సచివాలయ సిబ్బందికి సూచించారు. మండలంలోని గొటివాడ సచివాలయాన్ని ఆయన మంగళ వారం సందర్శించారు. విధుల నిర్వహణ, పథకాల అమల్లో ఎదురయ్యే ఆచరణాత్మక ఇబ్బందులను సచివాలయ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రికార్డులను తనిఖీ చేసి సంక్షేమ పథకాల చార్ట్‌లను పరిశీలించారు. ప్రజల నుంచి వస్తున్న అర్జీలను సకాలంలో పరిష్కరించాలని సూచించారు.అదేవిధంగా గ్రామంలోని రైతు భరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్,ప్రభుత్వ పాఠశాల,అంగన్‌వాడీ కేంద్రాలతో పాటు వైఎస్సార్- జగనన్న లేఅవుట్‌లను పరిశీలించారు. ఎఫ్ లైన్ ద్వారా నిర్వహిస్తున్న క్షేత్ర స్థాయి సమగ్ర భూ సర్వేను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట ఎంపీడీవో రమేష్ నాయుడు, హౌసింగ్ ఏఈ శేఖర్ నాయుడు, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.


గొటివాడలో నిర్వహిస్తున్న రీ సర్వేను పరిశీలిస్తున్న ట్రైనీ కలెక్టర్ స్మరణ్‌రాజ్

వడ్లపూడిలో చోరీ

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 87వ వార్డు వడ్లపూడిలోని ఓ ఇంట్లో దొంగలు చొరబడి, నాలుగున్నర తులాల బంగారం, అరకేజీ వెండి అపహరించారు. దువ్వాడ క్రైం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. వడ్లపూడి తెలుకల వీధిలో ఫార్మా ఉద్యోగి రొంగలి మోహనరావు కుటుంబంతో నివాసముంటున్నారు. అగనంపూడిలో కొత్త ఫ్లాట్ కొనుగోలు చేసిన వారు గృహప్రవేశం చేసేందుకు ఈ నెల 1న అక్కడికి వెళ్లారు. మూడు రాత్రులు నిద్ర చేయాలన్న ఆచారం ప్రకారం అక్కడే ఉండి, 4వ తేదీ రాత్రి వడ్లపూడి తిరిగి వచ్చేసరికి ఇంటి తాళం పగలగొట్టి ఉంది. బీరువా తెరిచి వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. దీంతో ఇంట్లో చోరీ జరిగిందని గుర్తించిన మోహనరావు దువ్వాడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. క్రైం సీఐ సూర్యనారాయణ, ఎస్ఐ కాళిదాసు సిబ్బందితో కలిసి వెళ్లి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. బీరువాలోని నాలుగున్నర తులాలు బంగారు ఆభరణాలు, అర కేజీ వెండి అపహరించినట్లు గుర్తించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


బీరువాలో సామగ్రి చిందర వందరగా పడేసిన దృశ్యం

అలరించిన 'స్తోత్ర గాన ఝురి'

ఎంవీపీ కాలనీ: ఎంవీపీ కాలనీ టీటీడీ కల్యాణ మండపంలో 'స్తోత్ర గాన ఝురి' ఆధ్యాత్మిక కార్యక్రమం ఆద్యంతం అలరించింది. శ్రీకంచి కామకోటి శంకర మఠం విశాఖపట్నం, శ్రీ వెంకట అన్నమాచార్య సేవా ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీమాన్ తాళ్లపాక స్వామి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. స్వామీజీని పలువురు ఆధ్యాత్మిక వేత్తలు దర్శించుకుని ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా చిన్నారులు పాడిన సంకీర్తనలు అలరించాయి. కార్యక్రమంలో మఠం కార్యదర్శి అచ్యుత రామయ్య తదితరులు పాల్గొన్నారు.


కీర్తనలు పాడుతున్న చిన్నారులు

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

దాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో కె. తిరుమలేశ్వర రావు, పర్యవేక్షకుడు ముద్దాడ రమణ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

20వ రోజుకి శ్రావణలక్ష్మి పూజలు

కనకమహాలక్ష్మి ఆలయంలో శ్రావణమాసం సందర్భంగా నిర్వహిస్తున్న శ్రీలక్ష్మీ పూజలు మంగళవారం 20వ రోజుకి చేరాయి. ఉదయం 8 గంటలకు వేద మంత్రాలు, నాదస్వరాల నడుమ ప్రారంభమైన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. పోస్టు ద్వారా వచ్చిన భక్తుల పేరిట పూజలు చేసి కుంకుమ, అమ్మవారి యంత్రం, ప్రసాదం పంపారు. శ్రావణలక్ష్మి పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.400 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని ఈవో కె. శిరీష తెలిపారు. పూజలకు సంబంధించి వివరాలకు 0891-2711725, 2566514 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, పలువురు ధర్మకర్తలు, ఏఈవో కె.తిరుమలేశ్వరరావు, ఆలయ సిబ్బంది, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

7న సహస్ర తులసిపూజ

కనకమహాలక్ష్మి దేవస్థానంలో ఈ నెల 7న సహస్ర తులసిపూజ నిర్వహించనున్నామని ఈవో కె. శిరీష తెలిపారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు పూజా రుసుం రూ.1500 చెల్లించి దంపతులు ఈ పూజలో పాల్గొనవచ్చని ఈవో పేర్కొన్నారు.

యువతపైనే దేశ భవిత

ఏయూక్యాంపస్: యువతపైనే దేశ భవిత ఆధారపడి ఉందని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ అన్నారు. వారిలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసే బాధ్యత అధ్యాపకులదేనన్నారు. ఏయూ జాతీయ సేవా పథకం సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించిన యువజన అభివృద్ధి రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన ప్రసంగించారు. జాతీయ సేవా పథకం యువతను మార్పునకు సాధనాలుగా తయారు చేయాలని, తద్వారా వారిని నిపుణులైన మానవ వనరులుగా తీర్చిదిద్దాలని సూచించారు. సామాజిక కార్యకర్త ఆచార్య కె.శేఖర్ మాట్లాడుతూ యువతకు కెరీర్ కౌన్సెలింగ్ ఎంతో అవసరమన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు ఈ దిశగా యువతకు మార్గనిర్దేశం చేయాలన్నారు. యువతలో నైపుణ్యాలను వృద్ధి చేయాలని, దేశానికి సంపద సృష్టించే ప్రక్రియలో వారిని భాగస్వాములు చేయాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా యువత - మత్తు పదార్థాలు, యువత-రిస్క్ బిహేవియర్, యువత-మాతృభాషలో విద్యాబోధన, యువత-సామాజిక మాధ్యమాలు తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. సమావేశంలో ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ ఎస్.హరనాథ్, జిల్లా ప్రోగ్రాం అధికారి ఇ.పి. ఎస్.భాగ్యలక్ష్మి, విజయనగరం జిల్లా ప్రోగ్రాం అధికారి చంద్రశేఖర్, ప్రోగ్రాం అధికారులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఏయూ రిజిస్ట్రార్ కృష్ణమోహన్

ముగింపు సభను జయప్రదం చేయండి

అల్లిపురం : రాష్ట్రాన్ని రక్షించుకుందాం.. దేశాన్ని కాపాడుకుందాం అన్న నినాదంతో సీపీఐ చేపట్టిన రాష్ట్రస్థాయి బస్సు యాత్ర ఈ నెల 8న తిరుపతి సభతో ముగుస్తుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు తెలిపారు. బస్సుయాత్ర ముగింపు సభ ప్రచార పోస్టర్‌ను మంగళవారం సీపీఐ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 8వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు ఎస్వీ హై స్కూల్ గ్రౌండ్ నుంచి తిరుపతి మున్సిపల్ గ్రౌండ్ వరకు ప్రదర్శన ఉంటుందని పేర్కొన్నారు. అనంతరం జరిగే బహిరంగ సభలో సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా, జాతీయ కార్యదర్శి కె. నారాయణ, రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్‌కే రెహమాన్, సీఎన్ క్షేత్రపాల్, పి.చంద్రశేఖర్, నాయకులు జేడీ నాయుడు, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు